క్లుప్తంగా

నారాయణపురం కాలువ మరమ్మతులు ప్రారంభం



పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో నారాయణపురం కుడి కాలువ మరమ్మతులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి సోమవారం ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట నుంచి ఓలేటి అగ్రహారం వరకు కాలువలో పూడికలు, పిచ్చి మొక్కల తొలగింపుతో పాటు ఇతర పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను శ్రీకాకుళంలోని జెడ్పీ కార్యాలయంలో సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించినట్టు ఎంపీపీ చెప్పారు.

పరామర్శ..



ప్రకాశరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అరసవల్లి: బోధనతోపాటు వ్యక్తిత్వంలోనూ ప్రత్యేకతను చూపిన రిటైర్డ్ సివిక్స్ లెక్చరర్ వై.వి.ఎస్.ప్రకాశరావు ఎందరికో ఆదర్శనీయుడని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక న్యూకాలనీకి చెందిన ప్రకాశరావు ఇటీవల మృతి చెందారు. ప్రకాశరావు కుటుంబ సభ్యులను మంత్రి సోమవారం పరామర్శించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రకాశరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశరావు భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు రామకృష్ణ, అర్చన, స్వప్న, శ్రీనివాస్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రీజనల్ సెక్రటరీ ఆర్.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా శ్రీనివాస్, శిమ్మ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నాయీబ్రాహ్మణ గర్జన విజయవంతం చేయాలి



గారలో కరపత్రాలను ప్రదర్శన చేస్తున్న నాయీబ్రాహ్మణులు

గార: ఈ నెల 27న అంబేడ్కర్ ఆడిటోరియంలో జరగనున్న నాయీబ్రాహ్మణ గర్జన, థాంక్యూ ధర్మాన కార్యక్రమానికి నాయీబ్రాహ్మణులంతా హాజరై విజయవంతం చేయాలని మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం నాయీబ్రాహ్మణుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను (స్టిక్కర్లు) ప్రదర్శించారు. జగనన్న చేదోడు క్షౌర వృత్తిదారులకు 50 ఏళ్లకు పింఛన్ పథకం అమలు చేయడం, ప్రతీ గ్రామంలో సామాజిక సెలూన్లు ఏర్పాటు ఏర్పాటు వంటి అంశాలపై చైతన్య సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులు హాజరువుతారన్నారు. కేవీ రమణమూర్తి, చందు, కామేష్, రమణ, లక్ష్మణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు



కేక్‌ను కటింగ్ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి

శ్రీకాకుళం అర్బన్: దేశానికి దిశానిర్దేశకుడు రాహుల్‌గాంధీ అని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ జోడో యాత్రకు సంఘీభావంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని బెహరా మనోవికాస్ కేంద్రంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, అంబటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- మంత్రి ధార్మాన ప్రసాదరావు
- ఖాజీపేటలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం: రాష్ట్రంలో ప్రజావైద్యానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ నాలుగేళ్లలో గ్రామాల్లో ఎంతో మార్పు వచ్చిందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఖాజీపేటలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి వెళ్లావల్సి వచ్చేదని, ఇప్పుడు ఊరిలోనే అన్ని కార్యాలయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే గతంలో జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ఇవ్వాల్సిందేనని.. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే ఆన్‌లైన్‌లో ఉంటుందని, మ్యూటేషన్ వెంటే అయిపోతుందన్నారు. 75 ఏళ్లలో వైద్య రంగంలో ఎన్నడూ చేయనన్ని మార్పులు తీసుకువచ్చామన్నారు. విలేజ్ క్లినిక్‌లో 102 రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి అత్యాధునిక సౌకర్యాలను తీసుకువచ్చామని, ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. పబ్లిక్ హెల్త్‌లో అనేక మార్పులు తీసుకువచ్చామన్నారు. మీ ఆరోగ్యంపై నిరంతరం సమీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యం అందించేలా 60 రకాల మందులు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రెండు లక్షల మందికి నిష్పక్షపాతంగా ఉద్యోగాలు ఒకేసారి ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. మేలు చేసే ప్రభుత్వానికే మరోసారి అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటరావు, ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్, జెడ్పీటీసీ రూపాదివ్య, ఏఎంసీ చైర్మన్ ఎం.తాతబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గోండు కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించిన కిల్లి జీవితకు జిల్లా సమగ్రశిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు చేయూత అందించారు. 2023 ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కింతలిలో చదువుకున్న కిల్లి జీవిత పొందూరు మండల పరిధిలో ప్రథమ స్థానంలో, ఆమదాలవలస నియోజకవర్గస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. జగనన్న ఆణిముత్యాలలో ఇప్పటికే ప్రభుత్వం తరఫున రావాల్సిన సాయాన్ని అందించారు. పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో నిరూపేద విద్యార్థిని జీవితకు ఉన్నత చదువుల కోసం సాయం అవసరం అవుతుందని తెలుసుకున్న ఆ పాఠశాల హెచ్ఎం, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ గోవిందరావు రూ.5వేలు ఆర్థికంగా సాయాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులమీదుగా అందించి ప్రోత్సహించారు. మున్ముందు చదువుకు అవసరమైన సాయాన్ని అందిస్తానని జీవితకు భరోసా ఇచ్చారు.



కిల్లి జీవితకు స్పీకర్ చేతులమీదుగా సాయాన్ని అందజేస్తున్న బుడుమూరు గోవిందరావు

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సీతారాంపురంలో ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు చేరువ అవుతున్నాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. తెప్పలవలస గ్రామ సచివాలయం పరిధిలోని మీసాలబడి, పాపారావుపేట, సీతారాంపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి సంక్షేమాన్ని తెలియజేశారు. చేకూరిన లబ్ధి వివరాల జాబితాను చదివి వినిపించారు. ఏమైన సమస్యలుంటే చెప్పాలన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథాలను వర్తింపజేస్తున్నామన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీర్వదించి విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయిపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, కిల్లారి రమణ, మహంతి చినరామినాయుడు, గురాన మానస, తెప్పలవలస పంచాయతీ సర్పంచ్ బొమ్మలాట సంతోషి, ఎంపీటీసీ సభ్యురాలు చోడవరపు శాంతమ్మ, నాయకులు కొయ్యి సోములరెడ్డి, దన్నాన హరి, బొమ్మలాట శ్రీరాములు, అచ్చోడు, దన్నాన నర్సునాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



లావేరు: విద్యార్థులకు బహుమతులుఅందజేస్తున్న హెచ్ఎం రమణ



జి.సిగడాం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

లావేరు: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పేరుతో నగదు పారితోషకం, పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు బెజ్జిపురం హైస్కూల్ హెచ్ఎం ఎస్.రమణ అన్నారు. ఈ ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన పాఠశాలకు చెందిన విద్యార్థులు నున్న సూర్యప్రవంతి, ఇజ్జాడ రోజశ్రీ, దన్నాన ఆకాష్‌కు బహుమతులను సోమవారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.సిగడాం: అణిముత్యాల పేరుతో విద్యార్థులకు ప్రభుత్వం బహుమతులు అందిస్తుండడంతో వారిలో పోటీతత్వం పెరుగుతోందని స్థానిక మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక అన్నారు. టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పొగిరి ఇందుమతి, కాలెపు మోక్షశ్రీ, కంచు దేవిలకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడు మంచి ఫలితాలు సాధించగలమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మజ్జి ఈశ్వరనాయుడు, పిచ్చుక నేతాజీ, కోట తిరుపతిరావు, చీర్రాపు రవికుమార్, అరుణకుమారి, నాగమణి, ప్రమీల, ఉషారాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రణస్థలం ఎంఈవో-2



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లావణ్య

రణస్థలం: రణస్థలం ఎంఈవో–2గా నియమితులైన బోనెల లావణ్య ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాంలను కూడా కలిశారు.

ఎంఈవో-2గా రాజకిశోర్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంఈవో–2గా నియమితులైన జి.రాజకిశోర్ మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల విద్య బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

జేవీకే కిట్ల పంపిణీ



పిల్లలకు కిట్లను అందజేస్తున్న నాయకులు

లావేరు: పెదలింగాలవలస ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన జగనన్న విద్యాకానుక కిట్లను సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టరు అప్పలనాయుడు సోమవారం పంపిణీ చేశారు. హెచ్ఎం గణపతి, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శివాంగం నాగరాజు, నాయకులు చందక నాగరాజు, నెల్లి దాలినాయుడు, పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.

సాగుహక్కు పత్రాలపై అవగాహన

జి.సిగడాం: కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు చిత్తిరి మోహన్ అన్నారు. ఆనందపురం రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలపై అవగాహన కల్పించారు. సాగుహక్కు పత్రాలు ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలు, రాయితీపై పనిముట్లు, ఎరువులు విత్తనాలు అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మక్క సాయి తేజు, వీఆర్వో రాజశేఖరం, బాలి లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని శీపన్నాయుడిపేట సమీపంలో పేకాట శిబిరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. రెండో పట్టణ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావు తెలిపిన వివరాలు.. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ చెప్పారు. వారి వద్ద నుంచి రూ.32,800 నగదు, నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

శ్రీకాకుళం న్యూకాలనీ: వివిధ యూజీ (డిగ్రీ) కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఉన్నత విద్యామండలి ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు గడువు విధించారు. జూలై 3వ తేదీన కాలేజీల్లో సీట్ల కేటాయింపు జరగనుంది. జూలై 4 నుంచి తరగతులు ఆరంభమవుతాయి.

అవగాహన సదస్సుల నిర్వహణ..

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 2023 –24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ప్రవేశ నిమిత్తం వచ్చిన విద్యార్థులకు అవగాహన సదస్సును కళాశాలలోని సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియం వేదికగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సుకు సుమారు వంద మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కళాశాల అడ్మిషన్స్ కన్వీనర్ బి.మోహన్‌రావు విద్యార్థులకు నాలుగు సంవత్సరాల డిగ్రీ హానర్స్ సింగిల్ మేజర్ సబ్జెక్టు కోర్సులు, కళాశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, సౌకర్యాలు, విశిష్టత గురించి వివరించారు.

ప్రభుత్వ కళాశాలలనే ఎంచుకోవాలి..

కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులతో కూడిన బృందం గొప్పతనాన్ని, సువిశాలమైన క్రీడామైదానం, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, లైబ్రరీ, జవహర్ నాలెడ్జ్ సెంటర్, రిసోర్స్ సెంటర్, లాంగ్వేజ్‌ల్యాబ్‌లు, క్యాంటీన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్ట్స్ కళాశాలకు 15 సింగిల్ మేజర్ సబ్జెక్టులతో బీఏ, బీకాం, బీఎస్సీ– హానర్స్ డిగ్రీ ప్రవేశాలకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల సదుపాయాలు కలిగిన డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థుల కోసం (ఆన్‌లైన్ దరఖాస్తులను చేసేందుకు) ప్రత్యేకంగా సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

హామీలన్నీ అమలు చేశాం

- మేలు చేసిన ప్రభుత్వానికి అండగా ఉండండి
- గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజాసంకల్పయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా అధికారం చేపట్టిన నాలుగేళ్లలోనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. శ్రీకాకుళం నగరంలో కాకివీధి సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు అందాలంటే బ్రోకర్లకు లంచాలివ్వాలి, అలా చేయకుంటే పనులైన దాఖలాలు లేవన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలకు, విద్య, వైద్యం, నివాసం యోగ్యత లాంటి ఉపశమనం కలిపించాలన్న నిర్ణయం వైఎస్సార్‌సీపీ తీసుకుని, ఆ దిశగానే అడుగులు వేస్తోందన్నారు. టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలన్నీ విస్మరిస్తే ..99 శాతం మేర మ్యానిఫెస్టోని అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. మహిళలను శక్తివంతులుగా చేసేందుకు వారి పేరు మీద పథకాలు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఆ రోజు టీడీపీ సర్కారులో జన్మభూమి కమిటీల బ్రోకర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నేరుగా ప్రభుత్వ పథకాల ద్వారా అందే ఆర్థిక లబ్ధిని బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడంతోనే ఇంతటి ఘనత సాధ్యమైందన్నారు. ఇదంతా మీరు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి అధికారం దక్కించడం వల్లనే సాధ్యమైందన్నారు. స్కూల్ తెరిచిన మొదటి రోజునే జగనన్న విద్యా కానుక పేరిట విద్యార్థులకు బుక్స్, యూనిఫాం, బెల్ట్, షూస్ ఇలా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కిట్ ఇచ్చామన్నారు. తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండాలని సీఎం జగన్ నేరుగా వీటి విషయమై పర్యవేక్షిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమల్లో భాగంగా మంచి ఆహారం అందిస్తున్నామన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను గొప్పగా తీర్చి దిద్దుతున్నామన్నారు. ఇవేవి ఓట్లుకోసం చేసే పనులు కావన్నారు. ఈ మార్పును ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మేలు చేసే ప్రభుత్వానికి అండగానిలిచి మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు సహకరించాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వాస్పత్రిని ఒకసారి చూస్తే తెలుస్తుందన్నారు.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 900 బెడ్లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం.వి.పద్మావతి, బొడ్డేపల్లి పద్మజ, సాధు వైకుంఠరావు, చల్ల అలివేలుమంగ, కోణార్క్ శ్రీనివాస్‌రావు, ఖాన్, పొన్నాడ రిషి, మండవిల్లి రవి, ఎం.ఎ.బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన ఐక్యవేదిక ఏర్పాటు



బహుజన ఐక్య వేదిక నూతన కార్యవర్గం

రణస్థలం: దళితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రణస్థలం మండల బహుజన ఐక్యవేదికను ఏర్పాటు చేసినట్టు జిల్లా నాయకులు లాషా సోమేశ్వరరావు, గంట్లాన రామారావు, ఇనప దుర్గారావు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో బహుజన ఐక్యవేదిక సమావేశం ఏర్పాటు చేసి పలు సమస్యలపై చర్చించారు. జిల్లా నాయకుల పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐక్య వేదిక అధ్యక్షులుగా సాకేటి పోతయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా యజ్జల సోములు, ఉపాధ్యక్షులుగా పల్ల అప్పన్న, ఇంటి హరిప్రసాద్, దత్తి గోవింద, బొమ్మలాట రాము, సూరప్పడు, ప్రధాన కార్యదర్శిగా దుక్క ఆదినారాయణ, బవిరి ప్రదీప్, సహాయ కార్యదర్శులుగా నేతల పెంటయ్య, లంక రమేష్, నడుపూరి యేసానందం, మామిడి జగదీష్, లంకలపల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులుగా కుప్పిలి సీతప్పడు, బవిరి రమణను ఎన్నుకున్నారు.

పేదల కుటుంబాల్లో సంతోషం



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి పేద కుటుంబం వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సంతోషంగా ఉందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కొత్తపేట గ్రామంలో 'పల్లెపల్లెకు ఎంపీపీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ నవరత్నాలు పథకాలను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఒకటో తేదీనే వలంటీర్లు తలుపుతట్టి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్తపేటలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ. 3.59 కోట్లు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్‌బాబా, బెందు రామారావు, బగ్గు రాజారావు, నక్క కృష్ణమూర్తి, మూగి శ్రీరాములు, బొడ్డేపల్లి సుధాకర్‌రావు, సర్పంచ్ గజలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గురుగుబెల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కర్లాం గ్రామానికి చెందిన కొంతమంది ప్రజలు గెద్దకంచరాం గ్రామంలో 70 ఏళ్ల క్రితం తమ భూములు ఉన్నాయని వాటిని ఇప్పించాలని కలెక్టర్‌కు ఇటీవల వినతలు ఇచ్చారు. దీనిపై సోమవారం ఫిర్యాదారులతో చర్చించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను గుర్తించి వాటిని సచివాలయం పరిధిలోనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీటీలు నిర్మల, హనుమంతురావు ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు పొట్నూరు జగన్‌మోహన్, భూపతి నర్సింగరావు పాల్గొన్నారు.

నేటినుంచి అరసవల్లిలో జగన్నాథ ఉత్సవాలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో సంప్రదాయం ప్రకారం ఆషాఢ శుద్ధ విదియ నుంచి ఆషాఢ శుద్ధ దశమి వరకు జగన్నాథ స్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ సోమవారం తెలిపారు. ఈ దశ తిథుల నాడు పూరీ జగన్నాథ స్వామి ఆలయ ఆచార సంప్రదాయాలకు తగ్గట్టే ఇక్కడ కూడా పలు రూపాల్లో జగన్నాథ స్వామి దర్శనాలుంటాయి. మంగళవారం ఉదయం నుంచే ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథుని ప్రతి రూపాలను సిద్ధం చేశారు. పది రోజులపాటు అరసవల్లి క్షేత్రంలో ఆదిత్యునితోపాటు జగన్నాథస్వామి వారి దర్శనాలు కలుగనున్నాయి.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మంచినీటిపైపు లైను పనులను పరిశీలిస్తున్న యువనేత రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తాగునీటికి ఇబ్బంది పడుతున్న పెద్దపాడు గ్రామం పొందరవీధిలో మంచి నీటి పైపులైన్లను ఏర్పాటుచేశారు. ఈ పనులను యువనేత ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉందన్న విషయం తన దృష్టికి రాగానే సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు చేపట్టామన్నారు. పనులు ప్రారంభం కావడంతో స్థానికులంతా ఆనందం వ్యక్తం చేశారు. నక్క దేవానంద్, రవి యాదవ్, పల్ల శ్రీరాములు, సింధు, దశరథ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.